# అగ్రనాయకత్రయం

పి. వి. పల్లి

గ్రామ మునసబు రంగస్వామి కచ్చేరీ సావిడిలో పడకకుర్చీలో కూచుని చుట్టకాలుస్తూ మాటాడుతున్నాడు. నారాయణస్వామి, గురుస్వామి ప్రభృతులు "ఊ"కొడుతున్నారు. మధ్య మధ్య "సెభాస్" అంటున్నారు. ఇంకో మాటు "మనముగ్గురం కలిసి జట్టుగా వున్నంతకాలం మన వూళ్లోగాని, చుట్టుపక్కల వూళ్ళల్లోగాని మన కెదురు వుంటారా?" అంటున్నారు. ఒక్కొక్కసారి ఫకాలున నవ్వుతున్నారు. గ్రామంలో యేదేనా ఒక కార్యక్రమం ప్రవేశపెట్టి పట్నం నుండి సానిమేళాన్ని తీసుకొచ్చి వినోదించాలని తీర్మానించారు. అయితే యీ తీర్మాన ప్రకారం జరిగేదాకా యెవరికీ తెలియనీయరాదనీ, తెలిసినట్లయితే ఎవరేనా రహస్యంగా తమకన్న ముందుగా ప్రయత్నిస్తారనీ నిర్ణయించారు. అయితే, తమముందు నిలబడ్డానికి ఎవరికీ గుండెలు లేవని నవ్వుకున్నారు.

మునసబుకీ, నారాయణస్వామికీ కాస్త నగదు నిల్వవుంది. గురుస్వామి పక్కతాళం వేస్తూ యిద్దర్నీ ఉపయోగించుకుని జీవితం సాగిస్తున్నాడు. ఒకప్పుడు రంగస్వామి యే పని చెయ్యడానికేనా వెనుదీస్తే, మిగిలిన యిద్దరూ ఆ పని అతనిచేత చేయించేదాకా నిద్దరపోరు. ఈ అగ్రనాయకత్రయం అవలంబించే మూర్ఖపు విధానాలకి గ్రామంలోని మర్యాదస్థులూ, సంపన్నులూ మారుమాటాడకుండా వూరుకున్నారు. ఆ "వూరుకోవడం" చూచి తమ ప్రతిభే కారణమని వీళ్లు మీసాలు మెలేస్తూవుంటారు.

సంభాషణల్లో గృహరాజకీయాల దగ్గరనుండి ప్రపంచ రాజకీయాలవరకూ-అన్ని విషయాలూ దొర్లిపోతున్నాయి. అయితే అందులో యెంత వరకూ సత్యం ఉంది? అంటే సమాధానంరాదు.

ఇలాగా ప్రపంచం అంతా తిరిగి మళ్ళీ స్వగ్రామం చేరుకున్నారు. భూమి గుండ్రంగా వుందని రుజువు చేసినట్లు.

రంగస్వామి అన్నాడు,"ఐతే కో ఆపరేటివ్ బ్యాంకు సొమ్ము ఎగ్గొట్టాలంటావు? ఏం గురూ"

"అవును-లేకపోతే అన్ని పదవులూ వాళ్ళే తీసుకుంటే మన ముగ్గుర్లోనూ పదవివున్న వాళ్లం లేముగా. ఈ డబ్బు ఎగ్గొట్టేస్తే సచ్చినట్టు మన పాదాలమీద పడతారు వాళ్లు." అన్నాడు గురుస్వామి.

దానిమీద నారాయణస్వామి అందుకుని, "అదికాదురా, డబ్బు చెల్లించేసి దెబ్బలాడాల. ఇంతకీ మనం యిచ్చీమంటే సెక్రటరీ పదవీ, ప్రెసిడెంటు పదవీ మనకే యిచ్చేస్తారు. యివ్వకపోతే వుండనేవుంది రభస" అన్నాడు మీసం మెలేస్తూ.

ముగ్గురూ ఫకాలున నవ్వుకున్నారు.

"చిత్తం బాబయ్యా" అన్నాడు తలారి రామయ్య. మళ్ళీ అన్నాడు, "పెభువులు తమ కడ్డేటి? తమ సేతుల్లోకి బేంకువస్తే నాకు వంద రూపాయిలిప్పించాల..."

"అల్లాగేలేరా—యెదవా" గొప్పతనం ఉట్టిపడేట్టు చిరునవ్వునవ్వుతూ అన్నాడు రంగస్వామి.

"అవునుగాని యీ యేడు మళ్ళీ తగవులొస్తాయి కాబోలు" అన్నాడు నారాయణస్వామి.

"ఎందుకు?" సంశయంగా అడిగాడు గురుస్వామి.

"యీ ఏసంగిలో చెరువులఒడ్డునున్న పొలాలికి తోలాలిగదట్రా. మునసబు పెర్మిషన్ లేందే ఎవరూ చెరువులో అడుగెట్టడానికి వీడులేదు. అప్పుడు మన తడాకా చూపించవలసివుంటుంది" అన్నాడు నారాయణస్వామి.

మందహాసంచేస్తూ అన్నాడు రంగస్వామి, "అవునోయ్. బండికి అర్ధరూపాయి యిస్తేగాని తోలనివ్వను. అరణాలు మనదీ, బేడ గవర్నమెంటుదీని."

"సెభాష్" మళ్ళీ నవ్వుకున్నారు ముగ్గురూ.

"అలాగే బాబయ్యా—" తాళం వేశాడు తలారి.

"అవునటోయ్ మున్సబూ—మీ శాంతమ్మ వూరొదిలి వెళిపోద్దట" అడిగేడు గురుస్వామి.

"వద్దు—వుండమన్నాను నేను. నెలకి అరవై రూపాయిలు యిచ్చేస్తానని చెప్పాను. పై రాబడి ఆశించకూడదని వార్నింగు యిచ్చాను. మొన్న కంట్రాక్టులో వచ్చినసొమ్ములోంచితీసి గొలుసు చేయించాను కదూ"

"అలాగా! అదిచూసే కాబోలూ మా రామయ్యమ్మకూడా చేయించమంటూంది" అన్నాడు గురుస్వామి.

"పట్టుపోళ్లు యెందుకు పనికొస్తార్రా యీళ్ల దగ్గర—మా రంగమ్మ దగ్గర ఆళ్ళంతా ససవలే" అన్నాడు నారాయణస్వామి.

"ఊన్నమాటన్నావు—" మళ్ళీనవ్వి—చుట్ట ముట్టించి "ఓయ్ రంగం సీసాలు రాత్రికి వస్తయి కదూ?" ప్రశ్నించాడు గురుస్వామి.

"రాకేం..." అంటూ తలారివేపు చూశాడు రంగస్వామి.

"యిప్పుడే యెల్తానుబాబూ" అంటూ నడిచాడు తలారి.

* * *

"నమస్కారం మునసబుగారూ"

"ఎవరది?"

"మాది ఒకవూరు కాదండి. నాటకాలాడుకుంటూ తిరుగుతూంటాం."

"అయితే యీవూళ్ళో..."

"ఔనండి. మా కంపెనీ మంచిపేరు సంపాదించింది నాటకాలు వెయ్యడంలో. దక్షిణ భారత దేశంలో మా కంపెనీ తరవాతే మిగతవి. అయితే పట్టణాల వెంబడిని మేంవెళ్లకపోవడంచేత మా కంపెనీ చిన్నకంపెనీ అని అంటారు. మాలో పాట పాడేవాళ్లు చాలామంది వున్నారు. యిప్పుడు సినిమాల్లో లాగ పేబాగ్ పాటలు అవసరం లేదు."

"అలాగా! ఎంతమంది మీ కంపెనీవాళ్లు?"

"అరవై యిద్దరు."

"కుటుంబాలతోటే వున్నారా?"

"అవునుసార్. భార్యాపిల్లలతో వున్నాం. అందరం వేషాలేస్తాం."

"మంచిది." మనస్సు ఉప్పొంగి పోతూంది మున్సబుకి.

"అయితే యెప్పుడువస్తారు మావూరు?"

"మీ అర్డయితే యీ వేళే వచ్చేస్తాం. ప్రస్తుతం యిక్కడికి దగ్గరగావున్న తోటలో వున్నాం."

"మా అభ్యతరం లేదు."

"అయితే ఈవూళ్లో ఎక్కడ హాలు తయారు చెయ్యమంటారు?"

"ఆ విషయం రేపు చెపుతాం. ముందు మీరు వచ్చి మా యిల్లు మరొకటివుంది అందులో వుండండి."

"యెస్ సార్! సాయంకాలం వచ్చేస్తాం."

* * *

"గురుస్వామీ! నాటకంవాళ్లు వచ్చారుకదా, వాళ్లకి హాలు కట్టుకోడానికి యెక్కడ స్థలం ఇస్తాం?"అడిగాడు రంగస్వామి.

"అన్నింటి మాటకేంగాని మేష్టరు పొగరు యెక్కువగావుంది. మనం యేపని చెప్పినా చెయ్యడు. పైపెచ్చు మనం చేస్తున్నపని తప్పుగా ప్రచారం చేస్తున్నాడు. వీడి పొగరు అణచాలి. అంచేత వాడి పెరటివేపు చాలా ఖాళీస్థలంవుంది. అక్కడ నాటకంవాళ్ళకి స్థలం యిచ్చేస్తే బాగుంటుంది. మరి మేష్టరు యెటూకదలలేడు. వాళ్ళ ఆడవాళ్ళుకూడా యింట్లో వుండిపోవలిసిందే—" అందించాడు నారాయణస్వామి సలహాని.

"ఆఁ. బాగుంది. అదే స్థిరంచేదాం"అన్నాడు రంగస్వామి.

"ఒరే నాయనా తప్పురా. మొదటినుండీ మన వూళ్ళో ఆయనవున్నాడు. మీకందరికి చదువులు చెప్పాడు. తిరిగి వాడికి నెట్టుకోవడం మంచిది కాదు" అన్నది ముసలమ్మ మునసబుతో.

"నువ్వూరుకో. తగలగలదు ఆట్టేమాటాడితే" తల్లిని చుందలించాడు రంగస్వామి.

"ఒయ్. నాటకాల మేనేజరూ ఆ స్థలంలో కట్టుకోండోయ్" ఆర్డరిచ్చాడు రంగస్వామి.

"బాబుగారూ మాకు మాట వస్తదండీ. మరో చోట స్థలం యిప్పించండీ."

"అయితే యీ వూళ్ళో వుండొద్దు."

"చిత్తం. మీమాట యెందుక్కాదనాలి సార్?" వెళ్ళిపోయాడు మేనేజరు.

"బాబూ మేష్టరుగారూ తమ పెరటివేపు వున్న జాగాలో మమ్మల్ని హాలు నిర్మించుకోమని మునసబుగారు ఆర్డరేశారండీ తమ సెలవుకోసం వచ్చాను" అడిగాడు మేనేజరు.

మేష్టరుగారు నవ్వేరు. "వాడు నా శిష్యుడే నోయ్" మళ్ళీ నవ్వేరు. "ఐతే నీ వుద్దేశం?" ఎదురుప్రశ్న వేశారు మేనేజరుని.

"మా కెంతమాత్రం యిష్టంలేదు. ఇక్కడ తప్పితే మరెక్కడా జాగా యివ్వనంటున్నా రాయన."

"నే నడ్డుచెప్పను" అని లోపలికి వెళ్లిపోయారు మేష్టరుగారు.

"అదేంటినాన్నా అలా అంటారు?" ఉద్రేకపూరితుడై ప్రశ్నించాడు కొడుకు.

"నాయనా ప్రవాహం యెంత ఉధృతంగా వుంటుందో వీళ్ల పరిపాలన కూడా అలాగే వుంటుంది. అంచేత మనం తగ్గివుండడం మంచిది. ప్రవాహానికి ఎదురీదడం కష్టం. వాళ్ళంతా నా శిష్యులే; కాని నాకు ఎదురుతిరుగుతున్నారు. విశ్వాసఘాతకులు. కాకపోయినా పెరట్లో హాలు నిర్మించడం ఏం సబబు? చివరికి వాళ్లే పశ్చాత్తాపపడతారు. నడిమంత్రపు సిరి నరాలమీద పుండూ బాధించుతాయి."

"అవును బాబూ ఉన్నమాటన్నారు" వెళ్ళిపోయాడు మేనేజరు.

మునసబూ మిగిలిన నాయకద్వయం ఏమాలోచించారోగాని అక్కడ హాలు కట్టవద్దని మరోచోట జాగా యిచ్చారు. హాలు నిర్మాణమయింది.

"బాబూ తమరు ప్రారంభోత్సవం జరిపించాలి" అడిగేడు మేష్టరుగార్ని, మేనేజరు.

"నాకు అభ్యంతరంలేదు; కాని నేను వస్తున్నానంటే నువ్వు యీ వూళ్ళో నాటకాలు ఆడలేవు. మిగిలినవాళ్లు నిన్ను నిలవనివ్వరు. అంచేత ఆ పెద్దరికం వాళ్ళకే అంటగట్టు" అనేశారు మేష్టారు.

మేనేజరు నవ్వుకున్నాడు.

* * *

హాలునిండా జనం వున్నారు. తెరయెత్తగానే మునసబుగారు హుందాగా నడుస్తూ స్టేజి యెక్కి ఉపన్యసించడం మొదలెట్టారు.

"మన వూళ్లో నాటకం కంపెనీ వుండి నాటకాలాడిందంటే మన వూరికి యెంతో పేరు వస్తుంది. అయితే నా అనుమతిలేనిదే యే నాటకమేనా వెయ్యకూడదు. మార్చినప్పుడు నా పెర్మిషను వుండాలి..." యిల్లా నాలుగుముక్కలు తన గొప్పతనం, ఉట్టిపడేట్టు అనేసి దిగిపోయారు.

"సత్య హరిశ్చంద్ర" నాటకం మొదలుపెట్టబడింది. చంద్రమతి బాగా నటిస్తున్నదనీ-బాగుంటుందనీ యిల్లా రిమార్కులు పాస్ చెయ్యడం మొదలుపెట్టారు అగ్రనాయకత్రయం. మొదటి క్లాసు సుమారు ముప్ఫయికుర్చీలునిండా మునసబుగారి అనునాయులే నిండిపోయారు. మేనేజరు ఊరుకోవలసివచ్చింది.

నాటకం సగం జరిగి పోయింది. మునసబుగారు సీట్లోంచిలేచి బయటకు వెళ్ళిపోయారు. యెందుకో వెళ్ళివుంటాడని అందరూ అనుకున్నారు. పదినిమిషాలు గడిచాయి. గ్రీన్‌రూంలో గలాటా బయలుదేరింది. నాటకం ఆగిపోయింది. యింతకీ అక్కడ జరిగిందేమిటంటే మునసబుగారు గ్రీన్‌రూంలోకి వెళ్ళి చంద్రమతి వేషధారి డ్రెస్సుమార్చుకుంటూంటే చేరువగా వెళ్ళి యేమో చెయ్యబోయాడట. అందుమీద ఆమె చెంపపెట్టు పెట్టిందట. ఆ తరవాత అందరూ గుమిగూడారు. యిరుపక్షాలకూ దెబ్బలాట రేగింది. చేసేదిలేక మేనేజరూ యింకొందరూ నాయకత్రయం కాళ్లుపట్టుకుని బ్రతిమలాడు కొన్నారు తమని క్షమించమని.

మీసాలు తిప్పుతూ క్షమించామన్నారు. ఆపూటికి నాటకం మరి జరగలేదు. ఉదయం హాలు యెత్తివేయబడింది. నాటకం కంపెనీవాళ్లు మకాం యెత్తేశారు.

వెళిపోతున్న మేనేజర్ని వెనక్కి పిలిచాడు మునసబు.

"సరేగాని యేం చెపుతావు నలుగురితోనూ?"

"మునసబుగారు యెంతో మర్యాద చేశారు. మాకు కావలసిన సదుపాయాలన్నీ చేశారు. అయితే మా దురదృష్టం కొద్దీ అక్కడ వుండలేకపోయాం. ఆ గ్రామంలాంటి గ్రామం యీ భూప్రపంచకంలో యెక్కడా వుండదు" అని చెపుతాను ప్రభూ."

"భేష్ అలావుండాలి. యేమేనా తప్పుగా చెప్పావా జాగ్రత్త" ముగ్గురూ ఒక్కసారిగా అన్నారు.